



మాట్లాడుతున్న సురేంద్రమోహన్

ఉమ్మడి జిల్లాలో 36 సంఘాలు గుర్తింపు

సహకార సంఘాల కమిషనర్ సురేంద్రమోహన్

మేడ్చల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): రైతు ఉత్పత్తిదారులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సహకార సంఘాల కమిషనర్ సురేంద్ర మోహన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సహకార సంఘాలతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పది వేల రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయాలని సంకల్పించినట్లు వివరించారు. ఇందులో భాగంగా 2023-24 సంవత్సరానికిగాను రాష్ట్రంలోని 32 జిల్లాల్లో 311 ప్రాథమిక వ్యవసాయ రైతు సేవా సహకార సంఘాలను గుర్తించినట్లు తెలిపారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో 9 సంఘాలు, రంగారెడ్డి జిల్లాలో 14 సంఘాలు, వికారాబాద్ జిల్లాలో 13 సంఘాలను ప్రాథమికంగా గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. అడిషనల్ రిజిస్ట్రార్ జి.శ్రీనివాసరావు, తెలంగాణ కోపరేటివ్ యూనియన్ ఎండీ అన్నపూర్ణ, ఎఫ్‌పీవోల నిర్వహణ గురించి తెలియజేశారు. ఫార్మర్ హార్టికల్చర్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ చక్రపాణి, సహజ వ్యవసాయ రైతు ప్రసాద్‌రెడ్డి ప్రభుత్వం చేత అందిస్తున్న సదుపాయాలను, లక్ష్యాలను తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధికారి సుధాకర్, వికారాబాద్ జిల్లా అధికారి నాగార్జున, తెలంగాణ కోపరేటివ్ యూనియన్ ప్రిన్స్‌పాల్ వెంకన్న, 36 సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎన్కెపల్లి స్కూల్ ఆవరణలో నిలిచిన నీరు

మోమిన్‌పేట్‌లో భారీ వర్షం

మోమిన్‌పేట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. ఎన్కెపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో భారీగా వర్షపు నీరు నిలిచి ఉండటంతో చెరువును తలపించింది. గ్రామంలో అస్తవ్యస్తంగా మురుగు కాల్వల నిర్మాణంతో ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు వాపోయారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పలు గ్రామాల్లో వడగండ్ల వర్షం కురవడంతో చెట్లు విరిగి పడ్డాయి. భారీ వర్షంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.



చీలాపూర్‌లో నో సర్వే!

40 ఏళ్లుగా కౌలతలకు నోచని భూములు

సర్వే గెజిట్ నోటిఫికేషన్ రాక పోవడంతోనే సమస్య

నేడు రెవెన్యూ మంత్రిని కలవనున్న గ్రామస్తులు

7



అధ్వానంగా కిష్టాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు

అభివృద్ధిలో అట్టడుగున!

సుపరిపాలన ఆధారంగా గ్రామాల జాబితా విడుదల

తొమ్మిది అంశాలను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం

జిల్లాలో అట్టడుగు స్థానంలో ముకుందాపూర్, కిష్టాపూర్, దౌలాపూర్, సంగాయిపల్లితండా, నంద్యానాయక్‌తండా

ఆ గ్రామాల్లో ఆగమాగంగా ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు

దిష్టిబొమ్మల్లా శ్మశాన వాటికలు, అధ్వానంగా రోడ్లు

నిధులు కొరత.. కొరవడిన అధికారుల పర్యవేక్షణ

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఇటీవల విడుదల చేసిన సుస్థిరాభివృద్ధి సూచికలో తాండూరు నియోజకవర్గం యాలాల మండలంలోని ముకుందాపూర్, కిష్టాపూర్, దౌలాపూర్, సంగాయిపల్లి తండా, బషీరాబాద్ మండలంలోని నంద్యానాయక్‌తండా అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచాయి. మురుగు కాల్వలు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, సరైన విద్యుత్ సౌకర్యం లేక ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీలలో జరిగిన అభివృద్ధి, సుపరిపాలన ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఆదర్శ గ్రామాలను ప్రకటించింది. కాగా 2022-23 నాటికి దేశంలోని గ్రామాలు సాధించిన అభివృద్ధి ఆధారంగా కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ పురోగతి సూచికలను విడుదల చేసింది. కేంద్రం ఏటా ప్రకటించే ఆచీవర్ జాబితాలో ఈ గ్రామాలు తక్కువ స్కోరు సాధించి అపఖ్యాతిని మూటగట్టుకున్నాయి.

యాలాల/బషీరాబాద్, ఏప్రిల్ 16, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముకుందాపూర్‌లోని పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కలకు నీటి సరఫరా లేదు. అలాగే చుట్టూ కంచె సైతం ఏర్పాటు చేయలేదు. దీంతో అందులో నాటిన మొక్కలు ఎండిపోయాయి. అలాగే గ్రామంలో నిర్మించిన శ్మశానవాటిక నాసిరకంగా నిర్మించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ప్రతీ గ్రామంలో విద్యార్థులు, యువకులు ఆటలు ఆడుకునేందుకు క్రీడా ప్రాంగణాన్ని నిర్మించాలని ఆదేశించినా ఈ గ్రామంలో అసలు క్రీడా ప్రాంగణమే నిర్మించలేదు. అలాగే ఇళ్లపై నుంచి విద్యుత్ వైర్లు వేలాడుతున్నా విద్యుత్ అధికారులు కనీసం పట్టించుకోని పరిస్థితి. మురుగు కాల్వలు చెత్తాచెదారం, మురుగుతో నిండి రోడ్లపైకి ప్రవహిస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని

మిగతా 8వ పేజీలో...

గ్రామాల వారీగా కేంద్రం గ్రేడింగ్

ముకుందాపూర్	42.15
కిష్టాపూర్	42.61
నంద్యానాయక్ తండా	42.63
దౌలాపూర్	43.61
సంగాయిపల్లి తండా	43.98



ముకుందాపూర్ పల్లె ప్రకృతివనం

దౌలాపూర్‌లో మురుగు కాల్వ దుస్థితి

అంగన్‌వాడీ కేంద్రంలో పంచాయతీ కార్యాలయం

సంగాయి పల్లితండాలో అసంపూర్తిగా శ్మశాన వాటిక

నంద్యానాయక్ తండా

పలుచోట్ల అసంపూర్తిగానే పనులు



అప్పట్లో జరిగిన గ్రామాల అభివృద్ధిపై ప్రతి గ్రామ సర్పంచ్‌ను ప్రోత్సహించాం. కొంత మంది పనులు ప్రారంభించి అసంపూర్తిగానే మిగిలించారు. ప్రభుత్వం ఇచ్చిన నిబంధనల మేరకు ఆయా గ్రామాల కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు ఆయా పనులను పూర్తి చేయాలని చెప్పినా కొంతమంది పూర్తి చేయలేక పోయారు. కాగా, మండలంలోని అన్ని గ్రామాల్లో ఇటీవల అభివృద్ధి ఊపందుకుంది.

-పుష్పలీల, ఎంపీడీవో యాలాల

స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలి

కీసరలో డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన

6

దశల వారీగా

సమస్యలు పరిష్కారం

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి లబ్ధిదారుతో భూమిపూజ చేయిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పరిగి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. బుధవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి మునిసిపల్ పరిధిలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించారు. అక్కడ మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆయన సందర్శించారు. అనంతరం బీసీ బాలుర వసతిగృహం, వ్యవసాయ కార్యాలయం, ఆర్అండ్‌బీ అతిథి గృహం, మునిసిపల్ కార్యాలయాలను సందర్శించారు. అనంతరం సుల్తాన్‌పూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో కూర్చొని సమస్యలు తెలుసుకున్నారు. వంద ఏళ్ల క్రితం నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి కొత్త భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అవసరమైన నిధులు ఇచ్చేందుకు..

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పరిగి నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు ఇవ్వడానికి సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని తెలిపారు. ఎవరూ ఆందోళన చెందొద్దని ప్రతి ఒక్కరికీ లబ్ధి జరిగేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎంపీడీవో కరీం, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, ఏఎంసీ చైర్మన్ పరుశరాంరెడ్డి, లాల్‌కృష్ణప్రసాద్, హన్మంత్‌ముదిరాజ్, కృష్ణ, డీసీసీ కార్యదర్శులు పాలాది శ్రీనివాస్, నాగులపల్లి రామకృష్ణ తదితరలు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

- భూ భారతిపై రైతులకు అవగాహన కల్పించనున్న అధికారులు
- నేడు పూడూరు సదస్సుకు హాజరుకానున్న మంత్రి పొంగులేటి



వికారాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన భూ భారతి కొత్త చట్టంపై అవగాహన కల్పించేందుకు నేటి నుంచి ఈ నెలాఖరు వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు రెవెన్యూ యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. మండల స్థాయిలో నిర్వహించే ఈ సదస్సులకు కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది హాజరుకానున్నారు. అలాగే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిసింది. ఈ నూతన చట్టం ఏ మేర సౌలభ్యంగా ఉందనేది రైతులకు అవగాహన కల్పించనున్నారు. గత అయిదారేళ్లుగా నిషేధిత భూముల జాబితా, పార్ట్ బీ భూములు, మిస్సింగ్ సర్వే నెంబర్లు, పేర్ల మార్పు, భూ హక్కులు, సాదాబైనామాల క్రమబద్ధీకరణ వంటి పలు అపరిష్కృత సమస్యలు భూ భారతితో పరిష్కారమవుతాయన్న ఆశాభావం రైతుల్లో వ్యక్తమవుతోంది. భూ సమస్యల పరిష్కారం తహసీల్దార్ స్థాయిలో కాకపోతే ఆర్డీవో.. అక్కడి నుంచి జిల్లా కలెక్టర్‌కు అప్పీల్ చేసుకునే అవకాశాన్ని నూతన చట్టంలో కల్పించారు. అధికారుల వద్ద న్యాయం జరగలేదని భావించే రైతులు న్యాయం కోసం ఆశ్రయించేందుకు ట్రిబ్యునళ్లు కూడా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

నేడు పూడూరుకు రెవెన్యూ మంత్రి

పూడూరు మండల కేంద్రంలో నేడు(గురువారం) నిర్వహించే రైతు అవగాహన సదస్సుకు రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేని శ్రీనివాసరెడ్డి హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రితో పాటు ఎమ్మెల్యే, కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది హాజరుకానున్నారు. మండల స్థాయిలో నిర్వహించే ఈ సదస్సుకు అన్ని గ్రామాల నుంచి రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

‘భూ భారతి’ రిజిస్ట్రేషన్లు షురూ!

గతంలో కంటే వేగవంతంగా ప్రక్రియ.. నిలిచిన ‘ధరణి’ పోర్టల్ సేవలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన రెవెన్యూ చట్ట ప్రకారం వ్యవసాయ భూముల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లు ‘భూ భారతి’ పోర్టల్ ద్వారా ప్రారంభమయ్యాయి. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు చేసే ‘ధరణి’ పోర్టల్‌ను శాశ్వతంగా రద్దుచేసి దీని స్థానంలో ‘భూ భారతి’ పోర్టల్‌ను ప్రారంభించింది. తొలుత రాష్ట్రంలో ఎంపిక చేసిన అయిదు మండలాల్లో ప్రయోగాత్మకంగా భూభారతిని అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. మిగతా అన్ని చోట్ల జూన్ 2వ తేదీ నుంచి ఈ సేవలు ప్రారంభిస్తామని తెలిపింది. అయితే అనూహ్యంగా అన్ని మండలాల్లో ‘భూ భారతి’ పోర్టల్ ద్వారా వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టింది. దీంతో అన్ని మండలాల్లో ధరణి ద్వారా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. బుధవారం ఉదయం అన్ని మండలాల్లో డిప్యూటీ తహసీల్దార్లకు లాగిన్ ఇచ్చి కొత్త విధానంలో రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు. డిప్యూటీ తహసీల్దార్లు లేని చోట్ల తహసీల్దార్లే లాగిన్ తీసుకుని రిజిస్ట్రేషన్లను ప్రారంభించారు. ఈ విధానం కొత్త కావడంతో కొన్నిచోట్ల సాంకేతిక ఇబ్బందులు తలెత్తాయి. అయితే ఈ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించి రిజిస్ట్రేషన్లు సజావుగా కొనసాగించారు.

పెద్దగా మార్పులేమీ లేకుండా..

ధరణి పేరు మినహా మిగతా పెద్దగా మార్పులేమీ లేకుండానే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు భూ భారతి పోర్టల్ ద్వారా జరుగుతున్నాయి. అయితే గతంలో కంటే వేగవంతంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. దీంతో రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారు సమయం ఆదా అవుతుందని సంతోషపడుతున్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరులో ఉదయం రిజిస్ట్రేషన్లు సకాలంలో ప్రారంభం కాలేదు. కొత్తగా అమల్లోకి వచ్చిన భూభారతి పోర్టల్‌లో లాగిన్ కావడానికి కొంత సమయం పట్టింది. అయితే ఈ సమస్యను వెంటనే పరిష్కరించి అధికారులు రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు. కొంత ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ బుధవారం స్లాట్లు బుక్ చేసుకున్న వారికి సకాలంలోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిచేయడం గమనార్హం. గతంలో ధరణి ద్వారా రిజిస్ట్రేషన్లు చేసే సమయంలో సాంకేతిక ఇబ్బందులు వచ్చి ఆలస్యం జరిగితే ఆ మేర సమయాన్ని పొడిగించి రాత్రి అయినా రిజిస్ట్రేషన్లు చేసే వారు. ఇపుడు ఈ పరిస్థితి లేదు. సర్వర్ వేగవంతంగా ఉండడంతో రిజిస్ట్రేషన్లు చకచకా జరుగుతున్నాయి.



మోమిన్‌పేటలో రిజిస్ట్రేషన్ చేయిస్తున్న వృద్ధురాలు

‘ఆంధ్రజ్యోతి’ విజేతలకు బహుమతులు



32 ఇంచుల టీవీ అందుకుంటున్న మూడో బహుమతి విజేత ఎం.చెన్నయ్య



రెండో బహుమతి విజేతగా నిలిచిన గాదిరాజ్ రవిచంద్రకు ఫ్రిజ్ అందజేస్తున్న డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ రవి

‘ఆంధ్రజ్యోతి’ 22వ వార్షికోత్సవం సందర్భంగా కార్ అండ్ బైక్ రేస్ హైదరాబాద్ యూనిట్ డ్రాలో గెలుపొందిన విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. రెండో బహుమతి విజేతగా నిలిచిన గాదిరాజు సువర్ణ లక్ష్మి తరపున ఆమె కుమారుడు గాదిరాజ్ రవిచంద్రకు రిఫ్రిజిరేటర్, మూడో బహుమతి విజేతగా నిలిచిన ఎం.చెన్నయ్యకు 32 ఇంచుల టీవీని ‘ఆంధ్రజ్యోతి’ తరపున డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ రవి అందజేశారు.

-హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి)



చిన్నరథంపై భద్రేశ్వరుడు

భద్రేశ్వరస్వామి ఊరేగింపు

తాండూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తాండూరు బావిగి భద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం రాత్రి భద్రేశ్వరస్వామి చిన్నరథంపై పల్లకీ సేవ నిర్వహించారు. భద్రేశ్వరస్వామి ఆలయం నుంచి గాంధీచౌక్, రాచన్న దేవాలయం వరకు అక్కడి నుంచి తిరిగి దేవాలయం వరకు స్వామివారిని భజన, సంకీర్తనలు ఆలాపన మధ్య పల్లకీ సేవ జరిగింది. నిత్యాన్నదానం రెండవ రోజు అన్నపూర్ణ దాసోహంలో కొనసాగింది. దేవాలయ గర్భగుడిలో ఆలయ రెనోవేషన్ కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరేగింపులో కన్నడీయులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో వీరశైవ సమాజం, ఆలయ కమిటీ సభ్యులు, వీరశైవ యువదల్, అక్కమహాదేవి మహిళా మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

కాశీంపూర్ ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడి

బషీరాబాద్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కాశీంపూర్ గ్రామ ఇందిరానగర్ ఎస్సీ కాలనీ ప్రజలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. బుధవారం కాలనీలో కొత్తగా బోరు వేసి చోటుకు మహిళలు చేరుకుని బిందెలతో నిరసన తెలిపారు. వారు మట్లాడుతూ.. సింగిల్‌ఫేజ్ మోటార్ పాడై నీటి సమస్య తలెత్తిందని, దానికి మరమ్మతులు చేయించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు రాక, ఉన్న ఒక్క డైరెక్టు బోరూ పనిచేయక దూరం నుంచి నీటిని మోసుకొచ్చుకుంటున్నామని అన్నారు. నీటి సమస్యపై ఎమ్మెల్యేకు చెబితే మూడు నెలల కిందట బోరు వేయించారని, దానికి మోటారు బిగించలేదని, నీటి పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడంలేదని ప్రజలన్నారు. ఉన్నతాధికారులైనా సమస్యను తీర్చాలని డిమాండ్ చేశారు.


మోటారు వేయని బోరు వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు

చేవెళ్ల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టితే చర్యలు తప్పవని చేవెళ్ల టౌన్‌ప్లానింగ్ అధికారి మణిహారిక హెచ్చరించారు. చేవెళ్లలో రోడ్ల స్థలంలో చేపట్టిన నిర్మాణాలు, డబ్బాలను బుధవారం ఆమె ట్రాఫిక్ సీఐ వెంకటేశంతో కలిసి తొలగించారు. అనంతరం మాట్లాడుతూ.. రోడ్లను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ.. ఆక్రమణలతో ట్రాఫిక్‌కు ఇబ్బందులొస్తున్నాయని, వ్యాపారులు, ఇళ్ల యజమానులు రోడ్లపై నిర్మాణాలు, ఆక్రమనణలకు చేపట్టవద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు.


రోడ్డుపై వేసిన డబ్బాలను తొలగిస్తున్న అధికారులు

న్యాయవాదులకు అండగా ఉంటా

షాద్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ కోర్టు న్యాయవాదులకు అండగా ఉంటానని బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు నర్వ వేణుగోపాల్‌రావు అన్నారు. బార్‌అసోసియేషన్ ఎన్నికల్లో గెల్చిన సభ్యులు బుధవారం అసోసియేషన్ చాంబర్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ.. జూనియర్లు, సీనియర్లు అనే వ్యత్యాసం లేకుండా అందరికీ సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అసోసియేషన్‌లో ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించేందుకు కృషిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు చంద్రశేఖర్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, రమేష్, లింగంగౌడ్, జయమ్మ, రహీమొద్దీన్, శ్రీశైలం, విజయకుమార్‌గౌడ్, విజయభాస్కర్, శ్రీనివాస్, రూపాసింగ్ పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరించిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

మహిళా సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

దుద్యాల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈర్లపల్లి గ్రామ ఐక్య సంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సరిత, కార్యదర్శి పద్మమ్మ, కోశాధికారి విజ్జిబాయిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీసీ రాంచంద్రయ్య, వీవోఏ మల్కప్ప, లక్ష్మి పాల్గొన్నారు.

అనంతపద్మనాభస్వామి ఆలయ పాలకవర్గం ఏర్పాటు


నూతన పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

కొత్తూర్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): పెంజర్లలో గల శ్రీ అనంతపద్మనాభస్వామి ఆలయ నూతన కమిటీ సభ్యులతో ఎండోమెంట్ ఈవో రామశర్మ, ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి బుధవారం ప్రమాణం చేయించారు. ఐదుగురు కమిటీ సభ్యులు ప్రమాణం చేశారు. చైర్‌పర్సన్‌గా బెజవాడ అనితారెడ్డి రెండోసారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. పోశమోని శంకర్, దేశాల రమేష్, మామిడి పద్మారెడ్డి, కుమ్మరి రమేష్ మెంబర్లుగా ఎంపికయ్యారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. నూతన కమిటీని సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారమందిస్తానని చెప్పారు. స్వయం భూ అనంతపద్మానాభుడిని దర్శించుకుంటే కోరికలు నేరవేరుతాయన్నారు. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద అనంతపద్మనాభాలయం ఇక్కడ ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న కొత్తూర్ మాజీ జడ్పీటీసీ ఎం.శ్యాంసుందర్‌రెడ్డి, చైర్‌పర్సన్ అనితారెడ్డిలను అభినందించారు. కార్యక్రమంలో కొత్తూర్ మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ అంజమ్మ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోకుంటే అధోగతే...

రాజ్యాంగాన్ని రక్షించుకోకుంటే ప్రజలు అధోగతి పాలవకతప్పదని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. మక్తగూడ, గుడూర్, మల్లాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ నిర్వహించిన జై బాపు, జై భీం, జైసంవిధాన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళితులను అణచివేతకు రాజ్యాంగాన్ని మారుస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుతూ, గౌరవిస్తూ పాలన చేయాల్సిన పాలకులు నేడు వ్యవస్థలను నాశనం చేస్తున్నారన్నారు. దేశాన్ని పాలించిన గత కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని పాటించి, ప్రజలను ఏకతాటిగా నిలిపాయన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు రాజ్యాంగంపై ప్రజలను చైతన్య పరిచేందుకు జై సంవిధాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని, త్వరలో మరిన్ని పథకాలు తెస్తారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ కొత్తూర్, షాద్ నగర్ మున్సిపాలిటీల అధ్యక్షులు జె.సుదర్శన్‌గౌడ్, చెన్నయ్య, నాయకులు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, నర్సింహ, విశ్వం, పి.రఘు. బాబర్‌ఖాన్, ఇబ్రహీం, బాల్‌రాజ్‌గౌడ్, దయానంద్‌గుప్తా, బాల్‌శౌర్‌రెడ్డి, సురేందర్, కె.కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి,కుమారస్వామిగౌడ్, దర్శన్, సాయిలు, సంజీవ, రాందాస్, రాజు, శేఖర్, జె.రవి, మల్లేష్ పాల్గొన్నారు.

కార్మిక ఆర్థిక దోపిడీని అరికట్టాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు నరసింహ

శంషాబాద్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కార్మికుల ఆర్థిక దోపిడీని అరికట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ అన్నారు. శంషాబాద్‌లోని ఓ హోటల్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక సంఘం తెలంగాణ నాలుగో రాష్ట్ర మహాసభలు ఏప్రిల్ 21, 22 తేదీల్లో శంషాబాద్‌లో నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్ కార్పొరేట్ కంపెనీలుల ఝార్ఖండ్, ఒడిషా, చత్తీస్‌ఘడ్, బెంగాల్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాల నుంచి కార్మికులను తెచ్చి తక్కువ వేతనంతో పనులు చేయించుకుంటున్నారని తెలిపారు. 12నుంచి 14గంటలు పనిచేయించుకొని శ్రమను దోపిడీ చేస్తున్నారన్నారు. భవణ నిర్మాణ కార్మికుల బోర్డులో అవకతవకలున్నాయన్నారు. నిధులను కార్మికుల కోసం ఖర్చుచేయడం లేదన్నారు. వలస కార్మికుల సంక్షేమ బోర్డు ఉం దన్న విషయం కూడా కార్మికులకు తెలియదన్నారు. దీనిపై అడ్డాల వద్ద లేబర్ అధికారులు కార్మికులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. నిర్మాణ కార్మిక సంఘం ఆహ్వాన సంఘం అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ.. అడ్డాల వద్ద సదుపాయాలు కల్పించాలన్నారు. 21న ఉదయం 10గంటలకు శంషాబాద్ బస్టాండ్ నుంచి ఎంఎంఆర్ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడే బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రామాస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్‌రెడ్డి నరసింహారెడ్డి, గిరి పాల్గొన్నారు.

మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

శంషాబాద్ రూరల్: మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ అన్నారు. శంషాబాద్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలు, కార్పొరేట్ అనుకూల చర్యలను దూకుడిగా అమలు చేస్తోందన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. వాటి రద్దుకు మే 20న దేశవ్యాప్తం సమ్మె చేస్తామన్నారు. ఈ నెల 26న కాటేదాన్‌లో సంఘాల జిల్లా సదస్సును నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దత్తునాయక్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నర్సింహారెడ్డి, గిరి, రుద్రకుమార్, రామ్మోహన్, మండల కార్యదర్శి మల్లేశ్, జె.సామిల్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

దుద్యాల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ అన్నారు. బుధవారం దుద్యాల మండలం చిలుముల్ మైలారం, పోలెపల్లి గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సిములుగౌడ్, వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, మల్లేశ్, వెంకటయ్యగౌడ్, చంద్రయ్య, జయరాములు, నర్సిములు, సెక్రటరీ రమేశ్ పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజేశ్‌రెడ్డి తదితరులు


అవార్డును అందుకుటున్న పురుషోత్తంరావు

కరణంకు నంది ఉగాది పురస్కారం ప్రదానం

తాండూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):తాండూరు ప్రాంతానికి చెందిన సీనియర్ రాజకీయ, సామాజికవేత్త, న్యాయవాది కరణం పురుషోత్తంరావుకు ఉగాది నంది పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని జయ ఇంటర్నేషనల్ హోటల్‌లో మంగళవారం రాత్రి ఉజ్వల సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, దైవజ్ఞశర్మల చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. 42 సంవత్సరాలుగా ఉమ్మడి జిల్లాలో తాండూరు సెగ్మెంట్‌లో రాజకీయ, సేవారంగాల్లో పనిచేసినందుకు ఈ అవార్డును, ప్రశంసాపత్రాన్ని బహూకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపతి డాక్టర్ వీరభోగ వసంతరాయ, ప్రముఖ పారిశ్రామికవేత్త ఎస్.ఆర్ పార్థసారథిరెడ్డి, బ్యాంకు డైరెక్టర్ జి.శ్రీలత, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బియ్యం అని ప్రచారం చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు

వికారాబాద్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల సన్నబియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వొస్తున్నాయని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యం ఫోర్టిఫైడ్ రైస్ అని ఇందులో అవసరమైన విటమిన్లు కలిపి పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం రేషన్‌కార్డు దారులకు పంపిణీ చేసే పార్టిఫైడ్ రైస్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల్లో భయం కల్గించేలా వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాల్లో షేర్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని, ప్లాస్టిక్ బియ్యాన్ని ప్రభుత్వం ఎందుకు సరఫరా చేస్తుందని ఆయన అన్నారు.

చైల్డ్ కేర్ హోం తనిఖీ


హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

వికారాబాద్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా సెమీ అర్బన్ నివేదిక కమిటీ ఆధ్వర్యంలో వికారాబాద్ పరిధి ధన్నారంలో గల స్వామీ వివేకానంద స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ హాస్టల్, పాఠశాలను అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తనిఖీ చేశారు. బుధవారం జిల్లా శిశుసంక్షేమాధికారి జయసుధ కలిసి ఆయన సందర్శించి పాఠశాల, హాస్టల్ రికార్డులను పరిశీలించారు. డార్మెటరీలు, వాష్‌రూమ్‌లను తనిఖీ చేశారు. పిల్లలకు భద్రత, ఆరోగ్య పరీక్షలు, భోజనం ఎలా అందిస్తున్నారు? అను అంశాలపై వార్డెన్లను అడిగారు. సందర్భంగా అదనపుకలెక్టర్ మాట్లాడుతూ.. మెనూ ప్రకారం ఆహారం అందించాలని ప్రతీనెల హెల్త్ చెకప్ చేయించాలన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలి

కీసర, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రవేశపెట్టిన స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలని బుధవారం కీసర సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు వద్ద డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చేశారు. స్లాట్ బుకింగ్‌తో ఆస్తుల కొనుగోలుదారులకు, విక్రయదారులు ఇబ్బందులు కలుగుతాయన్నారు. స్లాట్‌లకు ఆన్‌లైన్ సమస్యలొస్తాయన్నారు. డాక్యుమెంటేషన్ పనితో జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు స్లాట్ బుకింగ్‌తో తమ బతుకులు రోడ్డున పడతాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్లాట్ బుకింగ్ సిస్టంను రద్దు చేయాలన్నారు. పాత విధానాన్ని పునరుద్ధరించాలని సబ్‌రిజిస్ట్రార్ ఉమాదేవికి వినతిపత్రం ఇచ్చారు.


కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

పేదల కోసమే సాహసోపేత నిర్ణయాలు

కడ్తాల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పేదల శ్రేయస్సు, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధితో ప్రైవేటు వైద్యానికి ఆర్థికసాయం చేస్తోందని తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన 33మందికి రూ.14.5లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం మైసిగండి ఎమ్మార్వీ గార్డెన్‌లో ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సన్న బియ్యం పంపిణీ, భూ భారతి అమలు, ఇందిరమ్మ ఇళ్లు, కులగణన, ఎస్సీ వర్గీకరణ వంటి ప్రజాసంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తూ దేశంలో ఆదర్శ పాలన సాగిస్తున్నారని చెప్పారు. భవిష్యత్తులో తెలంగాణను రోల్‌మోడల్ స్టేట్‌గా తీర్చిదిద్దే పనులను రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందన్నారు. బీఆర్ఎస్, బీజేపీల పసలేని విమర్శలు, ఆరోపణలను ప్రజలు నమ్మడం లేదన్నారు. ఆ పార్టీలు ఉనికి కోసమే పాకులాడుతున్నాయన్నారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ ఐళ్ల శ్రీనివాసగౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత నర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ స్పోక్స్ పర్సన్ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి బిక్యా, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వై.నర్సింహ, సీనియర్ నాయకులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ కమిటీల బాధ్యులు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, బిచ్యా, లక్పతి, శేఖర్‌గౌడ్, నరేశ్‌నాయక్, హీరాసింగ్, నరేందర్, బోసురవి, బాల్‌రాజ్, జవహర్‌లాల్, కిషన్, తులసీరామ్, రాంచందర్, చందోజీ, పి.రాములు,వీరయ్య,ఇమ్రాన్,రామకృష్ణ, సత్యం,శంకర్, సుమన్, మల్లేశ్, జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజేశ్ పాల్గొన్నారు.

బీజేపీ విధానాలతో ముప్పు

ఆమనగల్లు: బీజేపీ విధానాలతో రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని, సంవిధాన్ పరిరక్షణకు పౌరులంతా బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. రానుంతల తండా, పెద్ద తండాల్లో బుధవారం జై సంవిధాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, బ్లాక్ ప్రెసిడెంట్ యాట నర్సింహల ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. దేశం అభివృద్ధి సాధించిందంటే మూలం రాజ్యాంగ అమలేనని, బీజేపీ విధానాలను ప్రతీ పౌరుడు వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అనితవిజయ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు మానయ్య, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణనాయక్, ఆనంద్, శ్రీరాములు, బల్రామ్, రమణారెడ్డి, పంతూనాయక్, జంగయ్య, శ్రీకాంత్, శ్రీశైలం, అంజన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, ఖాదర్, వినోద్, కృష్ణనాయక్, అరవింద్, మహేశ్, పరీద్, పంతూ, వినోద్, ప్రసాద్ పాల్గొన్నారు.

హైటెన్షన్ నిర్వాసితులకు పరిహారం పెంచాలి

కడ్తాల్: 765కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్‌కు భూములు కోల్పోతున్న తమకు ప్రభుత్వం న్యాయమైన పరిహారమివ్వాలని కడ్తాల రైతులు ఎమ్మెల్యే నారాయణరెడ్డిని కోరారు. మైసిగండికి వచ్చిన ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నాయకులు, రైతులు వినతిపత్రమిచ్చారు. కడ్తాలలో విద్యుత్ లైన్‌కు పోతున్న భూమి గజానికి రూ.5వేల పరిహారం ఇవ్వాలని కోరారు. రైతుల వినతిని ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతానని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో జంగారెడ్డి, రాములు, మహేశ్, వెంకటేశ్, గణేశ్, జంగయ్య, నర్సింహ, యాదయ్య, ఎల్లయ్య, రామకృష్ణ, పెంటారెడ్డి, గాంధీ, మల్లికార్జున్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, పాండుయాదవ్, శ్రీరాములుగౌడ్, కేశవులుగౌడ్, కె.శ్రీను, నవీన్, చెన్నయ్య, కె.వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యం

తాండూరు రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యమని తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి అన్నారు. రాంపూర్, రాంపూర్‌మీది తండా, సిరిగిరిపేట్ గ్రామాల్లో జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సరైన న్యాయం జరగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. నాయకులు అనిల్, ఉదయభాస్కర్‌రెడ్డి, జర్నప్ప, తులసీనాయక్, వెంకటయ్య, ఆశన్న, బుచ్చిరెడ్డి, రాంచంద్రారెడ్డి, రాములు, పురుషోత్తంరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగానికి ముప్పుగా బీజేపీ విధానాలు

కందుకూరు: రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా మోదీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, రాజ్యాంగ పరిరక్షణకు యువత నడుం బిగించాలని పీసీసీ ప్రచార కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం దాసర్లపల్లి, దాసర్లపల్లితండా, సాయిరెడ్డిగూడలో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ప్రజలకు రాజ్యాంగ గొప్పతనాన్ని విడమర్చారు. దానిని రద్దు చేసేందుకు జరుగుతున్న కుట్రలను వివరించారు. ఏఎంసీ డైరెక్టర్లు యుగేందర్‌గౌడ్, సురేందర్, శారదశేఖర్, యాదయ్య, టి.బాల్‌రాజ్, పాండు, అఫ్జల్‌బేగ్, సత్యనారాయణ, కె.రాణాప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

వికారాబాద్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో బీజేపీ ప్రభుత్వం ఈడీని వాడుకుంటూ సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై చార్జీషీట్‌ను జారీకి నిరసనగా బుధవారం వికారాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రధాని దిష్టి బొమ్మను దహనం చేశారు. భారత్ జోడో యాత్రలో దేశవ్యాప్తంగా పాదయాత్ర చేసిన రాహుల్‌గాంధీకొచ్చిన ప్రజాధారణను ఓర్వలేక ఇలాంటి కేసులకు పాల్పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు రాంచందర్‌రెడ్డి, నర్సింహులు, సురేందర్, కృష్ణ, రమేష్, షరీఫ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, మురళి, వేణుగోపాల్‌రెడ్డి, రెడ్యానాయక్, ఆసిఫ్, జంగయ్య, యాదయ్య, నర్సింహులు, మధుకర్, ఉస్మాన్, ఖలీద్, నిఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

మూన్‌వాకర్ వంశీకృష్ణపై డాక్యుమెంటరీ



వంశీకృష్ణ

తాండూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తాండూరుకు చెందిన మూన్‌వాకర్ వంశీకృష్ణపై డాక్యుమెంటరీ ప్రసారం చేసేందుకు ఓ టీవీ చానల్ అంగీకరించింది. వీఐపీ వంశీకృష్ణకు అంతర్జాతీయంగా మరో గౌరవం దక్కింది. తాను సాధించిన రికార్డులపై జాతీయ మీడియా చానల్ ఇండియా టీవీ తన 'ఐబీఆర్ హీరోస్' ప్రత్యేక కార్యక్రమంలో డాక్యుమెంటరీ ప్రసారానికి అంగీకరించిందని వంశీకృష్ణ బుధవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. డాక్యుమెంటరీలో తన బాల్యం, విద్యాభ్యాసం, కళారంగంగా సాధించిన ఘనతలు ప్రసారం చేస్తారని తెలిపారు. ఇది తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు.

పెండింగ్ కేసులపై మైన్స్ శాఖ దృష్టి

తాండూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులపై తాండూరు మైన్స్ శాఖ దృష్టి సాధించింది. గడువులోపు రాయల్టీ, ఫైన్ చెల్లించని వారిపై రెవెన్యూ రికవరీ యాక్ట్(ఆర్ఆర్ఏ) ప్రయోగానికి అధికారులు సిద్ధమయ్యారు. బుధవారం మైన్స్ ఏడీ కార్యాలయంలో లీజు దారులతో హైదరాబాద్ రీజియన్ డీడీ గోవిందరాజు, తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ సమావేశమై చర్చించారు. 2011 నుంచి 2025 వరకు సుద్ధ, నాపరాయికి సంబంధించి తాండూరు పరిధిలో 22కేసులు నమోదయ్యాయి. పెనాల్టీ చెల్లించాలని మైన్స్ నిర్వాహకులకు నోటీసులిచ్చారు. ఆరుగురు మాత్రం కొంత పెనాల్టీ చెల్లించారు. మరో 16మంది 7.62కోట్ల పెనాల్టీ చెల్లించాల్సి ఉంది. దీంతో మైన్స్ డీడీ.. ఇప్పటికైనా పెనాల్టీలు చెల్లించకుంటే ఆర్ఆర్‌యాక్టు ప్రయోగిస్తామని హెచ్చరించారు. కాగా కొందరు పెనాల్టీని రివైజ్ చేయాలని ప్రభుత్వానికి అప్పీలు చేసుకున్నారు. 14ఏళ్ల నాటి పెనాల్టీ చెల్లించాలని అధికారులు హెచ్చరించారు.

భూవివాదం పరిష్కారం

సర్వేతో పట్టా భూముల హద్దులు వెలుగులోకి.. పొజిషన్ చూపి రైతులకు న్యాయం చేస్తామన్న అధికారులు



తాటిపర్తిలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అయ్యప్ప

యాచారం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వందేళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాన్ని రెవెన్యూ, టీజీఐఐసీ, అటవీశాఖ అధికారులు బుధవారం పరిష్కరించారు. రైతుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి, రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని తాటిపర్తి గ్రామంలో 104 సర్వే నెంబర్‌లో 516 ఎకరాల 24గుంటలుండగా... ఇందులో ఫార్మాసిటీ కోసం 468 ఎకరాలను గత ప్రభుత్వం సేకరించి 120 మంది రైతులకు పరిహారం చెల్లించింది. ఈ 468 ఎకరాల్లో 250 ఎకరాల భూదాన్‌భూమి ఉండగా అనర్హులకు పరిహారం ఎలా ఇచ్చారని లోకాయుక్తలో మాజీ సర్పంచ్ రమేష్ కేసు వేశారు. 104 సర్వే నెంబర్ భూమి సరిహద్దులు సక్రమంగా లేవు. దీంతో 109 సర్వే నెంబర్‌లో 377ఎకరాల 8 గుంటల పట్టా భూమి 104 సర్వే నంబర్‌లోనిది అనుకొని 50 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. ఈ సర్వే నంబర్లలో సరిహద్దులు సక్రమంగా లేకపోవడంతో వందేళ్లుగా రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. తమకు న్యాయం చేసి ఆదుకోవాలని రైతులు ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి విన్నవించారు. దీంతో బుధవారం రెవెన్యూ, టీజీఐఐసీ, అటవీశాఖ అధికారులు ఉమ్మడిగా సర్వే చేయగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. 109 సర్వే నంబర్‌లో 377ఎకరాల 8 గుంటల పట్టా భూమి ఉందని అధికారులు తేల్చారు. ఈ భూమిని రైతులకు కబ్జా చూపిస్తామని ఆర్డీవో, రెవెన్యూ, టీజీఐఐసీ, అటవీశాఖ అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. 114 సర్వే నెంబర్‌లో 420ఎకరాల 34గుంటల పట్టా భూమి ఉంది. ఇందులో 120 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. 118 సర్వే నెంబర్‌లో 476 ఎకరాల 04 గుంటల పట్టా భూమి ఉండగా... ఇందులో 50 మంది రైతులు భూమి సాగు చేసుకుంటున్నారు. ఈ భూములపై కూడా విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేస్తామని ఆర్డీవో చెప్పారు.

చీలాపూర్‌లో నో సర్వే!

- సర్వే గెజిట్ నోటిఫికేషన్ రాకపోవడంతోనే సమస్య
- రైతులు కోర్టును ఆశ్రయించినా జరగని సర్వేలు
- భూముల క్రయవిక్రయాలు బంద్!
- నేడు రెవెన్యూ మంత్రిని కలవనున్న రైతులు, గ్రామస్తులు

40ఏళ్లుగా కొలతలకు నోచని భూములు



పరిగి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నా క్షేత్ర స్థాయిల్లో భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు. పాలకుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ గ్రామ భూముల సర్వే రైతులకు శాపంగా మారింది. సరిహద్దులు తేల్చుకోవడంలో 40ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. నాయకులు, రైతులు అనేక సార్లు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పూడూరు మండలం చీలాపూర్ రైతుల పరిస్థితి ఇది. గ్రామంలో 281సర్వే నంబర్లలో 850 ఎకరాల భూముంది. 270మంది పట్టాదారు రైతులు ఉన్నారు. భూముల రీ సర్వేపై రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్లే తాము సర్వే సమస్యను ఎదుర్కొంటున్నామని రైతులు చెబుతున్నారు. ధరణి, భూభారతి పోర్టల్లు వచ్చినా తమ సమస్యను పరిష్కరించడం లేదని వాపోతున్నారు. 1982లో చీలాపూర్‌లో భూములపై రీ సర్వేను చేశారు. అప్పట్లో కొందరు రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేయగా సర్వేను పెండింగ్ పెట్టారు. గెజిట్ నోటిఫికేషన్ రాకుండా కొందరు అడ్డుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. 2003లో భూముల సర్వే, రికార్డులను అమలుకు అధికారులు చర్యలు తీసుకున్నా, రీ సర్వే ముందు రికార్డులను లెక్కలోకి తీసుకున్నారు. భూముల క్రయ, విక్రయాలు జరిగాయి. 2018 తర్వాత నిర్వహించిన భూప్రక్షాళన, ఎల్ఆర్‌యూపీ, ధరణిలో భాగంగా రైతులు రీసర్వేకు ముందున్న రికార్డుల ఆధారంగానే నమోదు చేసుకున్నారు. కొత్తగా సర్వే చేయడం లేదు. గెజిట్ నోటిఫికేషన్ లేకుంటే భూముల అమ్మకాలు, కొనుగోళ్లు జరుగకూడదు. కొందరు క్రయ, విక్రయాలు చేసుకున్నారు. కొందరు రైతులు కోర్టులను ఆశ్రయించి సర్వే కోసం తిరుగుతున్నారు. తాజాగా గురువారం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పరిగి, పూడూరుల్లో నిర్వహించే పర్యటనలో చీలాపూర్ రైతులు తమ సర్వే సమస్యను వివరించేందుకు సిద్ధమవుతున్నారు.

అధికారుల తప్పిదం వల్లే



అధికారులు చేసిన తప్పిదం వల్లే మా ఊరిలో సర్వే సమస్యను ఎదుర్కొంటున్నాం. 40ఏళ్ల క్రితం భూములను సర్వే చేశారు. గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేదు. అప్పటి నుంచి సమస్య పెండింగ్‌లోనే ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు చెబుతూనే ఉన్నాం. ఏ అధికారి కూడా చొరవ తీసుకుని పరిష్కరించడం లేదు.

\- రామకృష్ణారెడ్డి, రైతు చీలాపూర్

క్రయ,విక్రయాలు నిలిచాయి



రీ సర్వే నోటిఫికేషన్ విడుదల చేయక భూముల క్రయ, విక్రయాలు నిలిచిపోయాయి. ఈ విషయంలో కలెక్టర్‌కు, ఎమ్మెల్యేలకు ఎన్నో సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. మా గ్రామంలో భూములు కొనేందుకు ఎవరూ రావడం లేదు. దీంతో మేం నష్టపోతున్నాం. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలి.

\- రామస్వామి, గ్రామ నాయకుడు

ఏళ్లుగా సర్వే సమస్య వాస్తవమే..

చీలాపూర్ భూముల రీ సర్వే విషయం ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న విషయం వాస్తవమే. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది. పట్టా పాసుపుస్తకాలు అయితే రైతులందరికీ జారీ చేశాం. రైతుల భూమి ఎక్కడికీ పోదు. క్రయవిక్రయాల సమస్య త్వరలోనే పరిష్కరించేలా చూస్తాం.

\- భరత్‌కుమార్, తహసీల్దార్, పూడూరు

కోర్టును ఆశ్రయించినా ఫలితం లేదు



భూముల రీసర్వే సెటిల్‌మెంట్ గురించి ఏళ్లుగా అధికారులకు మొరపెట్టుకుంటున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. నా భర్త ఆంజనేయులు పేరిట సర్వే నంబరు 268లో 4.06ఎకరాల భూమి ఉంది. 2012 నుంచి సర్వే చేయాలని తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోకవడం లేదు. సర్వే కోసం కోర్టునూ ఆశ్రయించాం. అయినా సమస్య పరిష్కరించడం లేదు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో సర్వే జరిగేలా చూడాలి.

\- కావలి అనిత, రైతు చీలాపూర్

'స్థానిక' ఎన్నికలకు సమాయత్తం కావాలి

ఆమనగల్లు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):స్థానిక ఎన్నికలకు బీజేపీ శ్రేణులంతా సమాయత్తమై పనిచేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీ, మండల ముఖ్య నాయకుల సమావేశం బుధవారం మున్సిపాలిటీ, మండలాధ్యక్షులు కర్నాటి విక్రమ్‌రెడ్డి, శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఆచారి హాజరై క్రియాశీల సభ్యత్వాలు, బలోపేతం, స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ప్రజాసమస్యలపై పోరాట కార్యాచరణను రూపొందించారు. మాజీ జడ్పీటీసీ హరిప్రసాద్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు లక్ష్మణ్, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

పరిగి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):వ్యవసాయ రంగ బలోపేతానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కేంద్ర వ్యవసాయాధికారి పజాయ్ అన్నారు. బుధవారం సుల్తాపూర్, రాపోల్ గ్రామాల్లో పంటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఎంపీపీ హర్షిత, నాయకుడు నాగవర్ధన్, రైతులు రాములు, గోపాల్‌రెడ్డి సమ్మయ్య పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో రక్తం కొరత

తాండూరు, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): తాండూరు జిల్లా ఆస్పత్రిలో రక్తం కొరత ఏర్పడింది. ఆస్పత్రి 200 పడకలతో కొనసాగుతోంది. ఇక్కడి నుంచే మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి కావలసిన రక్తాన్ని అందజేస్తారు. ఎండాకాలం కావడంతో రక్తదాతలు రాక రక్తనిధి నిండుకుంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డి.రవిశంకర్ చొరవతో ఈ నెల 17న(నేడు) ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అన్ని విభాగాల సిబ్బంది కూడా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆయన సూచించారు.


గురుకులాలకు ఎంపిక

కొడంగల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లోని నవీన ఆదర్శ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురుకుల పాఠశాలలో సీట్లు సాధించారు. దివ్యశ్రీ, సాయి, అనుదీప్, గౌతమ్, తరుణ్, వరలక్ష్మి ఐదో తరగతిలో, శ్రీవల్లి, వైష్ణవి, వర్షిత్, సందీప్‌గౌడ్, వరుణ్, మనోజ్, శ్రావణ్ ఆరో తరగతికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నరేశ్‌రాజ్ తెలిపారు. బుధవారం విద్యార్థులను కరస్పాండెంట్ లక్ష్మీవెంకటయ్య అభినందించారు.

నాసిరకం ఆహారంపై అధికారుల ఆగ్రహం

- ఫుడ్‌కోర్టు యజమానికి రూ.5వేల జరిమానా





ఫుడ్‌కోర్టును తనిఖీ చేస్తున్న అధికారులు, కిచెన్‌లో కన్పించిన కుళ్లిన చికెన్

చేవెళ్ల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): చేవెళ్లలోని ఎంజీ ఫుడ్‌కోర్టు(హోటల్)పై మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపించారు. ఆహారం నాణ్యతగా లేదని జరిమానా విధించారు. వివరాలు ఇలా ఉన్నాయి. చేవెళ్లలోని షాబాద్ చౌరస్తాలో ఉన్న ఎంజీ ఫుడ్ కోర్టును బుధవారం టీపీవో మణిహారిక, ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఇతర అధికారులు హోటల్‌లోని కిచెన్‌షెడ్ తనిఖీ చేశారు. హోటల్‌లో అపరిశుభ్రంగా ఉందని గుర్తించారు. వంటకు ఉపయోగించే చికెన్, గుడ్లు కుళ్లిపోవడం, మటన్ ఇతర పదార్థాలు సైతం నాసిరకంగా ఉండడంతో నిర్వాహకులకు రూ.5వేల జరిమానా విధించారు. మున్ముందు ఇలాగే నడిపితే మరిన్ని కఠిన చర్యలు తీసుకోని హోటల్‌ను సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు.

హోటల్‌ను సీజ్ చేయాలని డిమాండ్

చేవెళ్లలో ఫుడ్ కోర్టుల్లో అధికారులు తనిఖీల్లో నాణ్యత లేదని నిర్ధారణ కావడంతో స్థానికులు నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత పాటించని ఫుడ్‌కోర్టులు, హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లపై కేసులు నమోదు చేసి సీజ్ చేయాలని కోరారు. ఈ విషయంలో పోలీసులు, మున్సిపల్ అధికారులు కఠినంగా వ్యవహరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులకు ఉచిత కళ్ల అద్దాలు

- డీఎంహెచ్‌వో వెంకటరవణ



కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న వెంకటరవణ

వికారాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ ఐ స్క్రీనింగ్‌లో భాగంగా బడి పిల్లలకు ఉచిత కంటి అద్దాలను అందజేస్తుందని డీఎంహెచ్‌వో వెంకటరవణ పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్ కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 69,201 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 55 మంది పిల్లలకు శస్త్రచికిత్సల నిమిత్తం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ వారి కంటిని సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జీవరాజు, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ ప్రవీణ్ డిప్యూటీ డెమో శ్రీనివాస్ పీఎంవోవో స్వామినాథ్ ఆర్‌ఈఎస్‌కే బృందం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

రైతులకు సత్వరమే న్యాయం

- పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందుకు చెప్పిన విధంగా ధరణిని బంగాళఖాతంలో వేసి, దాని స్థానంలో భూ భారతి పోర్టల్ తీసుకొచ్చినట్లు డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం పరిగిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం సులభతరమయ్యేలా ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు తెలిపారు. దీంతో రైతులకు సత్వరమే న్యాయం జరుతుందన్నారు. ఈ పోర్టల్‌పై రైతుల్లో అవగాహన కల్పించేందు గురువారం పరిగి, పూడూరు మండల కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొంటున్నారని తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అవరణలో నిర్మించిన అదనపు షెడ్‌ను మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ పరుశరాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్,ప్రధానకార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, డీసీసీ కార్యదర్శులు పాలాది శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక బజార్‌తో దళారులకు చెక్



ఆదిభట్లలో ఇసుక బజార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఆదిభట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇసుక అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదిభట్లలో రాష్ట్ర ప్రభుత్వ ఖనిజాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక బజార్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. దళారీ వ్యవస్థను రూపుమాపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఇసుక బజార్‌కు శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటికే అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో ఇసుక బజార్ ప్రారంభించామని, నేడు ఆదిభట్లలో ప్రారంభించుకోవడం శుభపరిణామన్నారు. ఇల్లు కట్టుకునేవారు స్టాక్ యార్డుల నుంచే నేరుగా ఇంటికి ఇసుక తరలించడానికి ప్రభుత్వం ఆన్‌లైన్ యాప్ రూపొందించదన్నారు. దొడ్డు ఇసుక టన్నుకు రూ.1,600, సన్న ఇసుక టన్నుకు రూ.1,800కు అందిస్తామన్నారు. తెలంగాణ ఖనిజాభివృద్ధి శాఖ ఎండీ సుశీల్‌కుమార్ మాట్లాడుతూ ఇసుకను తరలించడానికి ప్రభుత్వం వద్ద 1,600 లారీలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, నాయకులు మహిపాల్, శేఖర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, సీఐ రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

కందుకూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వెంచర్‌లో కలుపుకున్న ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకోవాలని కొత్తగూడ కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం తహసీల్దార్ కె.గోపాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బి.సంజీవరెడ్డి, ఎస్.శేఖర్‌గౌడ్, ఖదీర్ మాట్లాడారు. కందుకూరులోని సర్వే నంబర్ 797లోని 38గుంటల ప్రభుత్వ భూమిలో రైతువేదిక నిర్మించాలని ప్రొసీడింగ్స్ ఇచ్చారని.. అయితే నిర్మాణం చేయలేన్నారు. దాని పక్కనే ఉన్న వెంచర్‌లోకి ప్రభుత్వ భూమిని కలుపుకొని ప్లాట్లుచేశారన్నారు. పూర్వం నుంచి కొత్తగూడ, కందుకూరు జీపీల మీదుగా వచ్చే వర్షపునీరు పిల్లివాగు ద్వారా ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులోకి వెళ్లేదని, వెంచర్ వేయడంతో పిల్లివాగులో నీరు పారడం లేదన్నారు. వాగు కూడా కబ్జా అయ్యే ప్రయాదం పొంచి ఉందన్నారు. దాని పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామస్తుల ఫిర్యాదుపై సర్వే చేయించి ప్రభుత్వ భూమిని రక్షిస్తామని చెప్పారు.

అభివృద్ధిలో అట్టడుగున!

(5వ పేజీ తరువాయి)

గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీకి చెత్త చెదారాన్ని తీసుకెళ్లే ట్రాక్టర్ ఉన్నప్పటికీ దాన్ని సరిగా వినియోగించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..



గ్రామంలో చాలా సమస్యలు ఉన్నాయి. కానీ వాటి పరిష్కారానికి ఎవరూ పట్టించుకోవడం లేదు. పల్లె ప్రకృతి వనానికి ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు చెప్పినా అధికారులు పట్టించుకోలేదు. శ్మశాన వాటికను నాసిరకంగా నిర్మించడంతో అది బీటలు వారిపోయింది. గ్రామంలో మురుగు ఎక్కడికక్కడ రోడ్లపై పారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

-రాజు, ముకుందాపూర్ గ్రామస్తుడు

అభివృద్ధిలో దౌలా'పూర్'

- నిరుపయోగంగా డంప్‌యార్డు
- గ్రామంలో జరగని ఉపాధి పనులు



పల్లె ప్రకృతివనంలో ఎండిన మొక్కలు

దౌలాపూర్ గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో పల్లె ప్రకృతివనం, క్రీడా ప్రాంగణం డంపింగ్ యార్డు నిర్మించినా వాటి పర్యవేక్షణ లేకపోవడంతో నేడు అవి నిరుపయోగంగానే మారిపోయాయి. పల్లె ప్రకృతివనంలోని మొక్కలకు నీటి సౌకర్యం లేకపోవడంతో పూర్తిగా ఎండిపోయాయి. తడి, పొడి చెత్త వేసేందుకు నిర్మించిన డంపింగ్ యార్డును వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నిరుపయోగంగా మారింది. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్నా దౌలాపూర్‌లో పనులు జరగడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్యం పడకేసింది



గ్రామంలో మురుగు కాల్వలను శుభ్రం చేయడం లేదు. గ్రామం పక్క నుంచి డబుల్ రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నందున ఆ దుమ్ము మొత్తం ఇళ్లలోకి వస్తుంది. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

-డప్పు లాలప్ప, దౌలాపూర్



సంగాయిపల్లితండాలో పాఠశాల దుస్థితి

సంగాయిపల్లితండాలో సగం సగమే!

- ముళ్ల పొదల మధ్యన శ్మశాన వాటిక
- పంచాయతీకి కార్యాలయం కరువు

సంగాయిపల్లితండాలో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయి. పర్యవేక్షణ లేకపోవడంతో పల్లె ప్రకృతివనం జాడే కనిపించకుండా పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రీడా ప్రాంగణాన్ని నిర్మించాల్సి ఉన్నా ఆ దిశగా గ్రామంలో చర్యలు చేపట్టని దుస్థితి. శ్మశాన వాటికను నిర్మించినా దాని చుట్టూ ఫెన్సింగ్ లేకపోవడంతో ముళ్ల పొదల మధ్యన దర్శనమిస్తుంది. గ్రామంలో పంచాయతీ కార్యాలయం లేని కారణంగా స్థానిక పాఠశాలలోని ఒక తరగతి గదిని తీసుకుని పంచాయతీ భవనంగా కొనసాగిస్తున్నారు. తండాలో వాటర్ పైప్‌లైన్ లీకేజీ అవుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. పక్కనే ఉన్న నడిమితండా నుంచి మైసమ్మ గుడి వరకు పాణాది రోడ్డు వేయాలని, జమాల్‌పల్లి పీర్ల వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని తండా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

మరమ్మతు చేయించాలి



గ్రామంలో చెత్తను తరలించే ట్రాక్టర్ పాడై రెండేళ్లు అవుతుంది. అయినా దాన్ని మరమ్మతును ఎవరూ పట్టించుకోవడం లేదు. డంపింగ్ యార్డు లేని కారణంగా గ్రామంలో ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనమిస్తోంది. తండా నుంచి దొర్నాల్ల తండా వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలి.

-నారాయణ, సంగాయిపల్లితండా

శ్మశానవాటికకు దారేది?

- కిష్టాపూర్‌లో ప్రకృతి వనానికి నీటివసతి కరువు
- పొలాలకు వెళ్లేందుకు దారి లేక అవస్థలు



కిష్టాపూర్‌లో చెత్త చెదారంతో నిండిపోయిన క్రీడా ప్రాంగణం

కిష్టాపూర్ గ్రామంలో క్రీడా ప్రాంగణం లేక యువకులు, విద్యార్థులు క్రీడలకు దూరమయ్యారు. పక్కనే ఉన్న గుండ్లకుంట చెరువు నిండితే పొలాలకు వెళ్లేందుకు దారి ఉండడం లేదు. దీంతో వర్షాకాలంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోంది. గ్రామంలో నిర్మించిన శ్మశానవాటికకు వెళ్లేందుకు సరైన దారి లేక గ్రామస్తులు నానా అగచాట్లు పడుతున్నారు. శ్మశాన వాటికకు దారి కల్పించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లె ప్రకృతివనానికి నీటి సౌకర్యం లేక నాటిన మొక్కలు పూర్తిగా ఎండిపోయాయి. ఇటీవలనే గ్రామంలోఅక్కడక్కడ సీసీ రోడ్లను వేసుకున్నారు.

పంచాయతీ భవనం లేక ఇక్కట్లు



గ్రామంలో పంచాయతీ కార్యాలయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తాత్కాలికంగా ఎస్టీ కమ్యూనిటీ హాల్‌లో కార్యాలయం కొనసాగుతోంది. పొలాలకు వెళ్లేందుకు గుండ్లకుంట చెరువు నుంచి రోడ్డు సౌకర్యం కల్పించాలి. వర్షాకాలంలో దారి సరిగ్గా లేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

- అంజిలప్ప, రైతు, కిష్టాపూర్



నంద్యానాయక్‌తండాలో మూడేళ్లుగా అసంపూర్తిగా శ్మశానవాటిక

వెనకబడిన నంద్యానాయక్‌తండా

నిధుల కేటాయింపు అంతంతమాత్రమే కావడంతో బషీరాబాద్ మండలం నంద్యానాయక్‌తండా పూర్తిగా వెనకబడిపోయింది. ఈ తండా 2018లో నూతన పంచాయతీగా ఏర్పడగా అంతకుముందు జమ్లానాయకత్‌తండాకు అనుబంధంగా ఉండేది. ఉపాధి కోసం ఈ తండా నుంచి ముంబాయి, పూణె, హైదరాబాద్‌కు వలసలు కొనసాగుతున్నాయి. పారిశుధ్యం, అంతర్గత రోడ్లు, సక్రమంగా లేవు. సెర్ప్ అధికారులు పేదరిక నిర్మూలనకు తండా మహిళలకు పొదుపు ఇతర అంశాలపై అవగాహన కల్పించకపోవడం వంటి కారణాలు కనిపిస్తున్నాయి. నాలుగేళ్లుగా పనులు సాగుతున్నా శ్మశానవాటిక అసంపూర్తిగా ఉంది. స్థలాభావంతో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయలేదు.

సకాలంలో బిల్లులు రాకనే..



అభివృద్ధి పనులు చేపట్టినా సకాలంలో బిల్లులు రాలేదు. కొత్త పంచాయతీ కావడంతో ప్రభుత్వ పథకాలపై తండాలో జనాలకు అవగాహన కల్పించినా మార్పు రాలేదు. ఇప్పటికైనా అధికారులు తండా అభివృద్ధిపై దృష్టి సారించాలి.

- శంకర్‌నాయక్, మాజీ సర్పంచ్, నంద్యానాయక్‌తండా

మహిళల అభ్యున్నతికి పెద్దపీట



కొడంగల్: మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

కొడంగల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం కొడంగల్ కడా కార్యాలయంలో ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్, తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులతో కలిసి కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 105 మంది మహిళలకు ఎస్సీ కార్పొరేషన్ కింద కుట్టు మిషన్లు అందించారు. సీఎం రేవంత్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, నాయకులు ప్రశాంత్, కృష్ణంరాజు, నయీమ్, ఆసిఫ్‌ఖాన్, ఎస్ఎం.గౌసన్, మెరుగు వెంకటయ్య, ఖాజ, ఎల్లప్ప, స్ఫూర్తి గ్రామీణ అభివృద్ధి సంస్థ సభ్యుడు వేణుగోపాల్‌రెడ్డి, మాణిక్యం, సాయప్ప, వెంకటప్ప పాల్గొన్నారు.

దుద్యాలలో..

దుద్యాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన 35 కుట్టు మిషన్లను కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతి రెడ్డి అందించారు. అలాగే 30 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

బొంరాస్‌పేట్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి అధికారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. నియోజకవర్గంలో మెడికల్, వెటర్నరీ, నర్సింగ్, ఇంజినీరింగ్ కళాశాలలతోపాటు మహిళా డిగ్రీ కళాశాల, బొంరాస్‌పేట్‌కు జూనియర్ కళాశాల, వ్యవసాయ కళాశాల త్వరలోనే మంజూరవుతాయని తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



దోమ: పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జగనమ్మ

దోమ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జగనమ్మ అన్నారు. బుధవారం మండలంలోని అయినాపూర్‌లో పోషణ మాసోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ కుసుమ, అంగన్‌వాడీ టీచర్ బాలమణి, మల్లమ్మ, నిర్మల, పంచాయతీ కార్యదర్శి నరేందర్‌గౌడ్, ఆశా వర్కర్ లక్ష్మి పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: పోషణ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మల్‌రెడ్డిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అంగన్‌వాడీ టీచర్ సుజాత అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, సేవ్యనాయక్, హెల్పర్ రాములమ్మ ఉన్నారు.

మర్పల్లి: చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యమని సీడీపీవో ప్రమీల అన్నారు. బుధవారం మండలంలోని పంచలింగాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎలాంటి ఆహారం అందించాలనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో సూపర్‌వైజర్ రిజ్వానా, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

కోట్‌పల్లి: తల్లి పాలతోనే బిడ్డకు రక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మూడో అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. పుట్టిన బిడ్డకు 6 నెలలు పూర్తిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం అపర్ణ, అంగన్వాడీ టీచర్లు సుహాసిని, జ్యోతి పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసానికి 1,963 దరఖాస్తులు

కులకచర్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకానికి 1,963 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. అందులో బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి 1,096, ఈబీసీకి 6, ఎస్సీ కార్పొరేషన్‌కు 352, ఎస్టీ కార్పొరేషన్‌కు 464, మైనారిటీ కార్పొరేషన్‌కు సంబంధించి ఈ నెల 14 వరకు 45 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. చౌడాపూర్ మండలంలో రాజీవ్ యువ వికాసం పథకానికి 1,080 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో సోమలింగం పేర్కొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు

మర్పల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లి చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో ప్రమీల, సూపర్‌వైజర్ రిజ్వానా అన్నారు. మర్పల్లి మండలంలోని పంచలింగాల గ్రామంలో బాల్య వివాహం జరుగుతున్నదని చైల్డ్‌లైన్‌కు సమాచారం అందడంతో గ్రామానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అన్నారు.

అగ్ని ప్రమాదాలను నివారించాలి

శామీర్‌పేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరూ భద్రతా నియామాలను పాటిస్తూ అగ్ని ప్రమాదాలను నివారించాలని మండల ఫైర్ ఆఫీసర్ వెంకటరమణారెడ్డి అన్నారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల పరిధిలోని మురహరిపల్లి గ్రామంలో అగ్ని ప్రమాదాలపై తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై పోస్టర్లను ప్రదర్శించారు.

రెండు కౌంటర్ల ఏర్పాటు

తాండూరురూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదం కారణంగా నిలిచిపోయిన బ్యాంకు సేవలను తాత్కాలికంగా తాండూరు పట్టణంలోని ఎస్‌బీఐ(ఏడీబీ)లో రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి కొనసాగిస్తామని కరన్‌కోట్ ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ భువన్ మోహన్ పేర్కొన్నారు. ఖాతాదారులు ఎవరూ ఆందోళన చెందవద్దని కోరారు. బ్యాంకులో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పూర్తిగా కాలిపోవడంతో తాండూరు నుంచి సేవలందిస్తున్నట్లు తెలిపారు. అగ్ని ప్రమాదంపై హైదరాబాద్ ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం నుంచి అధికారులు వచ్చి వివరాలు సేకరించారన్నారు.

చర్చి నిర్మాణానికి విరాళం

కోట్‌పల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కరీంపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అందరి అనీల్, ఆయన తండ్రి ఎల్లయ్య చేతులమీదుగా బుధవారం పెద్దేముల్ మండలంలోని మారేపల్లి గ్రామంలో నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి రూ.11 వేలు విరాళం అందించారు.

ప్రజలకు అందుబాటులో డీసీసీబీ సేవలు



యాలాల బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల, ఏప్రిల్ 16, (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండేందుకు హైదరాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకును అందుబాటులోకి తెచ్చినట్లు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం యాలాల మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా సమీపంలో డీసీసీబీ యాలాల బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కోరిక మేరకు ప్రతి మండల కేంద్రంలో డీసీసీబీ బ్రాంచీలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, అజయ్ ప్రసాద్, వెంకట్‌రాంరెడ్డి, యాలాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ వడ్డె రాములు, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, మొగులయ్య, మాజీ డీసీసీబీ చైర్మన్ లక్ష్మారెడ్డి, డీసీసీబీ సీఈవో సుబ్రహ్మణ్యం, ప్రభాకర్, డీజీఎం నాగాంజలి, మేనేజర్ నవీన్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలి

దోమ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ డిమాండ్ చేశారు. బుధవారం దోమ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో దివ్యాంగుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రిజర్వేషన్‌లు కల్పించాలని, లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈదయ్యబాబు, జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్, యువజన విభాగం నాయకులు శివకుమార్, పరిగి మండల అధ్యక్షుడు చంద్రయ్య, యండల యూత్ అధ్యక్షుడు మహేశ్, నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మయ్య, నాయకులు బాబు, చిన్న వెంకన్న, పెద్ద వెంకన్న, నర్సమ్మ, కాలమ్మ, శ్రీరాములు, లింగయ్య, గోపయ్య, శ్రీరాములు, నాగలక్ష్మి పాల్గొన్నారు.

రాజ్యాంగంతోనే అన్ని వర్గాలకు న్యాయం

చౌడాపూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంతోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. బుధవారం చౌడాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పార్టీ నాయకులతో కలిసి రాజ్యాంగ పీఠికను చదివి వినిపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో అందరికి సమాన హక్కులు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బందెయ్య, ఉపాధ్యాయులు మల్లికార్జున్, జనార్దన్, బాల్‌రాజ్, నరేశ్, రాము, రఘు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

తాండూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): శరీరంలో వచ్చే మార్పులను అశ్రద్ధ చేయొద్దని, వెంటనే వైద్యులను సంప్రదించాలని హైదరాబాద్ యశోద ఆస్పత్రి ప్రముఖ కేన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ సీ.ఎస్. శ్రీకాంత్ అన్నారు. బుధవారం తాండూరులోని ఎస్వీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఐఎంఏ యువజాగృతి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన క్యాన్సర్‌పై అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. పొగాకు, గుట్కావాడకం, కాలుష్యం, కల్తీ ఆహార పదార్థాల ద్వారా, వంశపారంపర్యంగా క్యాన్సర్ వచ్చే అవకాశాలున్నాయన్నారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స అందించి నయం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ జయప్రసాద్, మాజీ కౌన్సిలర్ సోమశేఖర్, యువజాగృతి అధ్యక్షుడు పర్యాద రామకృష్ణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బామ్మర్దులపై బావ రెక్కీ

దుండగులను పట్టుకున్న స్థానికులు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సొంత బామ్మర్దుల ఆస్తిపై కన్నేసిన బావ, నలుగురు దుండగులతో రెక్కి నిర్వహిస్తుండగా స్థానికులకు చిక్కారు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుశాపూర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి బోనాల పెంటయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు బోనాల రాజశేఖర్ అంకుశాపూర్ మాజీ ఉపసర్పంచ్, చిన్న కుమారుడు బోనాల ఈశ్వర్. కుమార్తె లావణ్యను 2009లో గచ్చిబౌలిలోని మసీద్‌బండకు చెందిన మేడ్చల్ శ్రీనివాస్‌తో వివాహం జరిపించారు. ఆ సమయంలో రూ.12 లక్షల నగదుతోపాటు ఎకరం భూమిని అప్పగించారు. పెంటయ్య ఉద్యోగ విరమణ తర్వాత వచ్చిన డబ్బులో వాటా కావాలని శ్రీనివాస్, లావణ్య గొడవకు దిగారు. బావమరుదుల ఆస్తిలో వాటా కావాలని బావ లావణ్యతో కోర్టులో కేసు వేయించాడు. అంతేగాక టోలిచౌకికి చెందిన ఇర్ఫాన్(18), సల్మాన్(18), సాహిల్(18) మరో మైనర్ బాలుడి (17)తో అంకుశాపూర్‌లో తన బావమరుదుల ఇంటి వద్ద రెక్కి నిర్వహించాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇందుకోసం వారికి గూగుల్ పే ద్వారా డబ్బులు సైతం పంపించి ఈశ్వర్ ఫొటో, లొకేషన్ షేర్‌చేశాడు. ఆ నలుగురు మాస్కులు ధరించి బుధవారం తెల్లవారుజామున రెండు బైక్‌లపై అంకుశాపూర్‌కు వచ్చి ఈశ్వర్, రాజశేఖర్‌ల ఇంటి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా గమనించిన స్థానికులు పట్టుకొని ఆరా తీశారు. పొంతనలేని సమాదానం చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు నలుగురి అదుపులోకి తీసుకొని వారి నుంచి సెల్‌ఫోన్ల, బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. తమను మేడ్చల్ శ్రీనివాస్ పంపించాడని, ఈశ్వర్, రాజశేఖర్‌ల కదలికలపై రెక్కి నిర్వహించాలని చెప్పినట్లు విచారణలో ఇర్ఫాన్ తెలిపాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు బావ శ్రీనివాస్, సోదరి లావణ్యలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రెక్కీ ఎందుకు నిర్వహించాడనే విషయాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం



అజమ్

పూడూరు, ఏప్రిల్ 16, (ఆంధ్రజ్యోతి): వృద్ధుడి అదృశ్యమైన ఘటన పూడూరు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. చెన్‌గోముల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎండీ అజమ్(70) మంగళవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాడు. మరుసటిరోజు ఉదయం భార్య లేచి చూడగా అజమ్ కనిపించలేదు. తెలిసిన వారు, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పూడూరు, ఏప్రిల్ 16, (ఆంధ్రజ్యోతి): కారు ఢీ కొని గాయాలతో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇవి.. వికారాబాద్ మండల పరిధిలోని గంగారానికి చెందిన కుర్వ స్వరూప(36) ఈనెల 10న మండలంలోని మన్నెగూడకు వచ్చింది. అక్కడి నుంచి తిరిగి వికారాబాద్ వెళ్లేందుకు తన కుమారుడితో కలిసి ఆటో కోసం ఎదురు చూస్తుండగా.. అటుగా వచ్చిన ఆటోను ఆపారు. ఆటో డ్రైవర్ రోడ్డుపై ఆపగా స్వరూపా ఆటో ఎక్కే క్రమంలో వెనుక నుంచి అతి వేగం అజాగ్రత్తగా వచ్చిన(ఏపీ13ఏబీ8199) కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్వరూపకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాలివానకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

పెద్దేముల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులకు కరెంటు స్తంభాలు నేల కొరిగాయి. ఒక ట్రాన్స్‌ఫార్మర్ పడిపోయింది. దీంతో మూడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండలంలోని అడ్కిచర్ల గ్రామంతోపాటు చుట్టుపక్కల తండాలకు తట్టెపల్లి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరాపరా అవుతుంది. బుధవారం వీచిన ఈదురుగాలులకు ఆడికిచర్ల శివారులో 11కేవీ విద్యుత్ స్తంభాలు రెండు విరిగి కింద పడిపోయాయి. వాటితోపాటు ఒక ట్రాన్స్‌ఫార్మర్ కిందపడిపోయింది. కొన్ని స్తంభాల తీగలు తెగిపడ్డాయి. దీంతో అడ్కిచర్ల, ఊరెంటితండా, బాయిమీదితండాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బీటీరోడ్డు మార్గంలో 11కేవీ ఏర్పాటు చేసి ఉంటే ఈసమస్య వచ్చేది కాదని మాజీ ఎంపీటీసీ ధన్ సింగ్ పేర్కొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫాక్స్‌కాన్ కంపెనీ ఆధ్వర్యంలో ఐఫోన్ మొబైల్ అసెంబ్లింగ్ ఆపరేటర్ ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 104 మంది హాజరుకాగా 65 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు దక్షిణామూర్తి, సుబ్రహ్మణ్యం, రేణుక, వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానమ్, రాంబాబు, శ్రీనివాస్, సోమ్లా పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

చౌడాపూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పాటి అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం చౌడాపూర్ మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ పాఠశాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శాశ్వతమైనది విద్య మాత్రమేనన్నారు. మండల కేంద్రంగా ఏర్పడిన తర్వాత మొదటి ప్రైవేట్ పాఠశాల ఏర్పడిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అన్నీ సదుపాయాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.